బేలెన్స్ తప్పలేదు. తప్పి వుంటే ఇక్కడ నీ కళ్ళముందే సర్కార్‌ని చంపేవాడ్ని. ఇప్పుడు వదిలిపెడుతున్నది నీకూ ఓ అవకాశం ఇవ్వాలని. ఒకనాడు నన్ను కోరిన నువ్వు పరోక్షంగా నా భార్య మరణానికి కారణ మయ్యావు. ఇప్పుడు నా గురించి నీకున్న అపోహలతో ఓ పసికందు ప్రాణాలుపోయే స్థితి కల్పించకు. నిన్ను కాస్త తల్లి మనసుతో ఆలోచించమని ప్రాధేయపడుతున్నది నాలాంటి ఓ అనాథ గురించి మాత్రమే.''

వెళ్ళిపోయాడు శశాంక ఇందాక వచ్చిన కిటికీలో నుంచే.

ఏనీల అలవోకగా అద్దంలోకి చూసింది. ఆమె చెంపపై గాయమైన శశాంక చేతి రక్తం అంటుకుని వుంది. తను మొన్న కోరిన ప్రేమకి అతడీనాడు రాసిన రక్తపు చేవ్రాలులా''

అప్పుడు ద్వారం తెరిచింది-

సరిగ్గా ఇదే సమయంలో గోడదూకి పరుగెడుతున్న శశాంకకి ఓ వ్యక్తి ఎదురుకావడంతో బాటు ''జయచంద్రని చంపేసారా బాబూ'' అంటూ ఉత్సుకతగా అడిగాడు.

టక్కున ఆగిపోయాడు శశాంక.

ఎదురు నిలబడ్డ వ్యక్తి బాగా తాగి వున్నట్టున్నాడు. ''రోజుల తరబడి ఎదురు చూస్తున్నానయ్యా. వాడి చావు ఊరేగింపుకి వెనక కాటిదాకా వెళ్ళాలని. ఏదీ మొన్న పోయాడనుకుంటే బ్రతికి పోయాడుగా.''

ఆ నిశ్శబ్ద నీరవ నిశీధిలో చాలా చిత్రమైన వ్యక్తిని కలుసుకున్నట్టు అనిపించిన శశాంక ''జయచంద్ర నీకు తెలుసా'' అన్నాడు.

''ఇద్దరం ఒకనాడు తోడు దొంగలమే బాబూ... వాడెంత దుర్మార్గుడూ అంటే కన్నకూతుర్ని ఓ విస్కీ బాటిల్ కోసం అమ్మేశాడు. ఆ బాటిల్ విస్కీతో పెరగడం మొదలుపెట్టిన వాడు నా మూలంగా వాడి కథ ప్రపంచానికిగాని, ఇప్పుడున్న చిన్న కూతురుకి గాని తెలియకూడదని నన్ను తెలివిగా జైలుకి పంపించాడు పధ్నాలుగేళ్ళు. ఈ లోగా నా పెళ్లాం పిల్లలూ పోయారు. అందుకే బాబూ. ఈ మధ్యనే జైలు నుంచి బయట కొచ్చిన నేను వాడి చావు కళ్ల చూడాలని అదీ నేను పోయే ముందు జరిగితే బాగుణ్ణని రోజులు లెక్క పెడుతూ బ్రతుకున్నాను.''

ఒక అద్భుతమైన ఆసరా దొరికినట్టయింది శశాంకకి. అంతకుమించి జయచంద్రపై అనూహ్యమైన ఏవగింపూ కలిగింది.

''ఇంకా వివరాలు చెప్పగలవా''

''ఇప్పటికిది చాలు బాబూ'' నిషాగా తూలుతూ నడిచి వెళ్ళిపోతుంటే తనతో రమ్మన్నాడు శశాంక అతన్ని వారించి.

ఎందుకో అర్థం కాలేదు అంతసేపూ శశాంకతో మాటాడిన ఆ వ్యక్తికి. ఆ వృద్ధుడెవరో కాదు వీరయ్య.

''నువ్వు బయట కనిపిస్తే వాడు ప్రాణాలు తీయిస్తాడు తాతా. కనీసం వాడి చావు చూసే దాకా అయినా నువ్వు భద్రంగా వుండాలి. అంత వరకూ నీకు కావలసిన

**కాలవ్‌దాటని కథ**

# సమస్యకు పరిష్కారం

చెంగయ్య, మంగయ్యలు చిన్నప్పటి నుంచి ప్రాణ స్నేహితులు. చెంగయ్య నాటు వైద్యుడుగా పల్లెటూరి జనాన్ని మోసం చేస్తూ, ఘన వైద్యుడుగా ప్రచారం చేసుకుంటూ నాలుగురాళ్ళు వెనకేశాడు.

మంగయ్య కోర్టులు, సాక్ష్యాలు ప్రామిసరీ నోట్లు దస్తావేజులంటూ జనాన్ని మరో విధంగాదోచుకున్నాడు. ఇద్దరి సంపాదన ఒకప్పుడు బాగానే వున్నప్పుడు వాళ్ళ వాళ్ళ భార్యలు వాళ్ళనెంతో ప్రేమగా చూసేవాళ్ళు. అయితే జనం తెలివిమీరి పోవడంతో ఇద్దరి ఆదాయం అడుగంటింది. ఏదో పాత కాలంలో సంపాదించింది తింటూ కాలక్షేపం చేయవలసిన పరిస్థితి ఏర్పడింది.



ఒక రోజు మిత్రులిద్దరూ ఒక పుణ్యక్షేత్రం దగ్గర కలుసుకుని తమ ఇబ్బందులు ఒకరికొకరు చెప్పుకున్నారు.

''మా ఆవిడలో ఈ మధ్య పెద్ద మార్పొచ్చిందిరా! ప్రతి దానికీ రెండర్థాలు తీస్తుంది. నేను ఏం చెప్ప బోయినా పోట్లాడుతుంది. గట్టిగా ఎదురు చెబితే ఏడుస్తుంది! నువ్వు వైద్యుడివిగా! కాస్త దీనికో విరుగుడు చెప్పరాదు!'' అన్నాడు మంగయ్య.

చెంగయ్య ఒక నిమిషం ఆలోచించి ''నువ్వు నీ భార్య కోపమంతా తగ్గేదాకావుండి — ఈ కోపతాపాలు వయసు పెరిగే కొద్దీ ఆడవాళ్ళలో వచ్చేవే! అను, చాలు!! ఆడవాళ్ళు ఏమైనా సహిస్తారు కాని తమ వయసు పెరుగుతుందనే మాట ససేమిరా సహించలేరు!'' అన్నాడు.

చెంగయ్య చెప్పినట్టే చేసిన మంగయ్య ఆ తరువాత మంచి హాయిగా వున్నాడు.

— ఎం.డి.సౌజన్య

దంతా నేను ఏర్పాటు చేస్తాను''

వీరయ్యతోబాటు అర్థరాత్రి వేళ శరణాలయానికి వచ్చిన శశాంకని చూసిన అన్నపూర్ణ ముందు అప్రతిభురాలైంది కాని పెదవి విప్పి అడగలేకపోయింది.

అన్నపూర్ణ జాకీలు చూస్తుండగానే ఫోన్ డయల్ చేశాడు. మూడు నిముషాల తర్వాత అందుకున్నారెవరో.

''హల్లో''

గుర్తుపట్టాడు అది సర్కార్ గొంతని. ''మీ బాస్ కావాలి''

''నువ్వెవరు''

''శశాంక''

''నిద్రపోతున్నారు''

''ఇక నిద్రవుండదులే బే ...ముందు ఫోనివ్వు''

''కుదరదు''

''అలానేం. అయితే చెప్పు. ఆయన స్నేహితుడు ఇప్పటివాడు కాదులే రెండు దశాబ్దాల క్రిందటి మిత్రుడు. వీరయ్య నాదగ్గరున్నాడని రేపుదయమే ఆయన పెద్ద కూతురు...'' అతడి వాక్యం ఇంకా పూర్తి కానేలేదు జయచంద్ర లైన్‌లోకి వచ్చాడు.

''వీ... వీరయ్యా...ఎవరు'' జయచంద్ర గొంతులో తొట్రుపాటు స్పష్టంగా వినిపించింది.

''ఎవరో రేపు ఏనీలకి చెబుతాను జయచంద్రా- ఈలోగా ఓ పనిచెయ్యి. రూపకేం ప్రమాదం జరక్కుండా నాకు అప్పచెప్పు. లేకపోతే పోయిన నీ పెద్ద కూతురు మాట అటుంచి వున్న కూతురు నిన్ను అసహ్యించుకునే స్థితేర్పడుతుంది.''

రూపని కిడ్నాప్ చేసిందెవరో అప్పటికి తెలిసిన అన్నపూర్ణ కళ్లు నీటి కుండలయ్యాయి.

''అంటే'' ఆమె గొంతు వణుకుతోంది. ''రూపని జయచంద్ర'' ఫోన్ క్రెడిల్ చేసిన శశాంకనే చూస్తూ అడిగింది.

''అవునమ్మా... ఇప్పుడు నన్ను దారిలోకి రప్పించు కోవాలని రూపని కిడ్నాప్ చేసిన జయచంద్రే మొన్న నా కృపని హత్య చేయించింది కూడా...''

నిజానికి భర్తని ఒకనాడు అసహ్యించుకునే దూరమైంది అన్నపూర్ణ. కాని కాదనుకున్నా పోని బంధమన్న ఆలోచనతో ఆ రోజు హాస్పటల్‌కి వెళ్లింది. బ్రతకాలని కోరుకుందేమో కూడా. కాని ఇప్పుడా ఆలోచనకే సిగ్గుపడుతోంది.

సరిగ్గా అదే సమయంలో--

''వీరయ్య బ్రతక్కూడదు. తెల్లారేలోగా వాడి బ్రతుకు తెల్లారిపోవాలి. లేకపోతే చాలా అనర్థాలు జరిగి పోతాయి'' జయచంద్ర. సర్కార్‌తో అన్నాడు ఉద్వేగంగా.

అంతే...

గేంగ్స్ రంగంలోకి దిగాయి ఆ విశ్రాంతి వేళలో... ఓ జీపులో సర్కార్ తన బలగంతో శరణాలయం వేపు దూసుకుపోతున్నాడు.

(సశేషం)